క్లుప్తంగా

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

మైదుకూరు : మైదుకూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మార్చి 9వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. లోక్ అదాలత్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇరు వర్గాల వారి అంగీకారంతో కేసులను పరిష్కరించనున్నారు. శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ మార్చి 9న జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడమే ఉత్తమమన్నారు. దీని వల్ల సమయం వృథా కాదని పేర్కొన్నారు. రాజీ వల్ల కేసులో ఏ ఒక్కరూ ఓడిపోరని, ఇరువర్గాలు గెలిచినట్లేనని న్యాయమూర్తి తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మైదుకూరు : ఈనెల 10న శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు డిపో పరిధిలో ఆర్టీసీ సేవలపై శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫిర్యాదులు, సలహాలు, సూచనలు 9959225781 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రొద్దుటూరు : సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008లో ప్రభుత్వం పేదలకు అమృతానగర్‌లో స్థలాలు ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికీ కొన్ని చోట్ల మౌలిక వసతులు కల్పించలేదన్నారు. వసతుల కల్పనతో పాటు స్థలాలను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లత, రమీజ, వెంకటేశ్వర్లు, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

ప్రొద్దుటూరు : విజయవాడకు వెళుతున్న ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక రాజీవ్ సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పనిభారం తగ్గించాలని, సమస్యలను పరిష్కరించాలని విజయవాడలో ధర్నాకు వెళుతుంటే వారిని అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ పల్లెకు పోదాం

చాపాడు : మండలంలోని వెదురూరు, కుచ్చుపాప, అనంతపురం, చాపాడు, తుమ్మలపాడు గ్రామాలలో శుక్రవారం బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పల్లెకు పోదాం కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రొద్దుటూరు : మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శనివారం ప్రారంభించనున్నట్లు తాళ్లమాపురం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూ.20.8 లక్షల అంచనా వ్యయంతో అన్ని వసతులు ఏర్పాటు చేసి హెల్త్ క్లినిక్‌ను నిర్మించినట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మైదుకూరు ఎంపీడీఓ ఫజల్ రెహిమాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆదిరెడ్డిపల్లె సచివాలయం పరిధిలో జనరల్ కేటగిరీ కింద ఒక వలంటీర్, మిట్టమానుపల్లె సచివాలయం పరిధిలో బీసీ మహిళకు ఒకటి, విశ్వనాథపురం సచివాలయం పరిధిలో ఓసీ మహిళకు ఒకటి, ఎస్సీ మహిళకు ఒకటి వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ పోస్టులకు ఈనెల 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 12వ తేదీ దరఖాస్తులను పరిశీలించి, 13, 14 తేదీల్లో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వివరించారు.

దళిత వేదిక జిల్లా అధ్యక్షుడుగా ఓబయ్య

పోరుమామిళ్ల : ఆంధ్రప్రదేశ్ దళితవేదిక జిల్లా కన్వీనర్‌గా పని చేస్తున్న చిన్న ఓబిగాండ్ల ఓబయ్యను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా శుక్రవారం పోరుమామిళ్లలో పలువురు అభినందించారు.దళిత వేదిక రాష్ట్ర సంక్షేమ కార్యదర్శి యోహాన్, పోరుమామిళ్ల మండల కార్యదర్శి ఆనంద్ ఓబయ్యకు శాలువ కప్పి సన్మానించారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం



ప్రొద్దుటూరు కల్చరల్ : ఆల్ బెండజోల్ మాత్రలను విద్యార్థినులచే మింగిస్తున్న డాక్టర్ శశిభూషణ్



చాపాడు : అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రలను తినిపిస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్



బద్వేలులో మందులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ, వైద్యాధికారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశిభూషణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించి ఆల్ బెండజోల్ మాత్రలను మిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు నులిపురుగులు రాకుండా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, గోర్లను శుభ్రంగా ఉంచుకోవాలని, ఏదైనా తినే ముందు, తిన్న తర్వాత, మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఏడాదికి రెండుసార్లు నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వం ఆల్ బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుండి 19వ సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు ఈమాత్రలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివప్రసాదరెడ్డి, హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్‌రెడ్డి, సీఓ సుబ్బారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులి పురుగులను తరిమేద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం

చాపాడు : అల్‌బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని దీని వలన ఆరోగ్యంగా జీవించవచ్చని ఎన్‌డీడీ పోగ్రాం ఆఫీసర్ నాగ శశిభూషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని 1 నుంచి 19 సంవత్సరాల వరకు పిల్లలు, విద్యార్థులకు శుక్రవారం మండల వైద్యాధికారులు రాజేష్‌కుమార్, కావ్య మాధురి, ఓబులేసుల ఆధ్వర్యంలో ఆల్‌బెండజోల్ మాత్రలను తినిపించారు. ఈ సందర్భంగా నాగ శశిభూషన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలు, కాలేజీలు, అంగన్‌వాడీ స్కూల్‌లలో విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం అనంతరం గంట తర్వాత మాత్రలను నమిలి మింగించాలన్నారు. నులిపురుగుల వలన అనారోగ్యానికి గురికావటంతోపాటు రక్తహీనత వస్తుందని దీని కోసం తప్పనిసరిగా అల్ బెండజోల్ మాత్రలను తినిపించాలని సూచించారు. రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర మాత్రమే తినిపించాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతి రోజూ చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌డీడీ పోగ్రాం ఆఫీసర్ సునీత, సీహెచ్ఓ మహాదేవయ్య, ఎంపీహెచ్ఈఓ రాఘవయ్య, ఆశ నోడల్ పర్సన్ సుకన్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు క్రైం : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నిర్మూలిద్దామని వైద్యాధికారులు హనీఫ్‌బాబా, శ్రీనివాస్‌లు తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కామనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1నుంచి 19 ఏళ్ల వయసు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 97 శాతం మంది పిల్లలకు మాత్రలను ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరీ స్టాఫ్ కృష్ణమ్మ, బీఏ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం

దువ్వూరు : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని డాక్టర్ వికసిత, ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుడిపాడు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పిల్లలకు అల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణ మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, విజయకుమారి, సువర్ణ, వివిధ పాఠశాలల సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థులలో రక్తహీనతకు, శారీరక ఎదుగుదల లేకపోవడానికి కడుపులో నులి పురుగులు ఉండటమే ప్రధాన కారణమని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి, బి.కోడూరు ఎంఈఓ సునీల్ కుమార్, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మండల వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆల్బెండజోల్ మాత్రలు మింగడం వలన చదువుపై హీమోగ్లోబిన్ పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బి.కోడూరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీరాంజనేయమ్మ, సీహెచ్ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశినాయనలో...

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు ఆధ్వర్యంలో నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జయరామ్ 120 మంది విద్యార్థులకు అల్బెండజోల్ నివారణ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని లలితాదేవి రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రం శ్రవణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా భస్మార్చన



భస్మార్చనలో అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. వేకువజామున స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చనలను నిర్వహించారు. సాయంత్రం అగస్త్యేశ్వర స్వామికి రుద్రాభిషేకం, సహస్రనామ భస్మార్చన నిర్వహించి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్ బాలాజీ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను అందిస్తున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

దువ్వూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ సుగుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. రోగులకు సురక్ష మెడికల్ కిట్లను అందించారు. వైద్య శిబిరానికి వచ్చిన 450 మందికి డాక్టర్లు వికసిత, శ్రీలలిత, నాగయ్య, చంద్రమౌళి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి సర్పంచ్ మహబూబ్ షరీఫ్ భోజన వసతి కల్పించారు.

చరణ్ సింగ్‌కు భారతరత్నపై హర్షం

మైదుకూరు : మాజీ ప్రధానమంత్రి చౌదరి చరణ్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం శనివారం భారతరత్న అవార్డును ప్రకటించడంపై మండలంలోని లెక్కలవారిపల్లెకు చెందిన సోషలిస్ట్ అభియాన్ వ్యవస్థాపకుడు, రైతు నాయకుడు లెక్కల వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశ 5వ ప్రధానిగా పనిచేసిన చరణ్ సింగ్ రైతుల విజేతగా పిలిపించుకున్నారని పేర్కొన్నారు. లోక్‌దళ్, భారతీయ క్రాంతి దళ్, భారతీయ కిసాన్ యూనియన్‌లను స్థాపించారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా కూడా పనిచేసిన చరణ్‌సింగ్ జీవితాంతం రైతుల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. ఆయన జయంతి డిసెంబర్ 23న జాతీయ రైతు దినోత్సవంగా నిర్వహించుకుంటుండటం రైతులకు గర్వకారణమన్నారు. ఆయనకు భారతరత్న ప్రకటించడం ఎంతైనా సముచితమని తెలిపారు.

ఎమ్మెల్యే సుధాకు శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీవో కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ జన్మదినం సందర్భంగా పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, సివిల్ సప్లెస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గోపాలస్వామి, సాయికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మిదేవి శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధకు శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యమైన హెల్మెట్‌లను విక్రయించాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : ద్విచక్ర వాహనదారులకు నాణ్యమైన హెల్మెట్‌లను విక్రయించాలని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆర్టీఓ కార్యాలయంలో శుక్రవారం ఆటో మొబైల్ షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ఐఎస్ఐ మార్కు కలిగిన కంపెనీ హెల్మెట్‌లు విక్రయించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాణ్యతలేని హెల్మెట్‌లు వాడితే రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు ద్విచక్ర వాహనదారుడికి రక్షణ కల్పించదని చెప్పారు. పట్టణంలోని డీలర్లు, ఆటో మొబైల్ షాపుల నిర్వాహకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఐలు వేణు, నారాయణ నాయక్, ఏఓ కరిముల్లా, ఆటో మొబైల్ షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ శశిభూషణ్

చాపాడు : గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి శశిభూషణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పీఎంఎస్ఎంఏ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు మేరకు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. రక్తహీనత లేకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు శ్రేయస్కరమని, గర్భిణులందరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ప్రసవాలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్ కుమార్, కావ్యమాధురి, సీహెచ్ఓ మహాదేవయ్య, ఎంపీహెచ్ఈఓ రాఘవయ్య, ఆశ నోడల్ ఆఫీసర్ సుకన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొర్రాయిపల్లెలో పశు వైద్య పరీక్షలు



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న సుదర్శన్‌రెడ్డి

చాపాడు : మండల పరిధిలోని మొర్రాయిపల్లెలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో 362 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పశు వైద్యాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తోందని ఈ క్రమంలో పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పశువులకు మేతకు తీసుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పశువులకు చికిత్సలు చేయించుకున్న రైతులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సహాయ సంచాలకులు నాగరాజ

అట్లూరు : రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ఏఏ పంటలు సాగు చేశారు, ఆయా పంటలకు సంబంధించిన యాజమాన్యపద్ధతులపై రైతులకు వివరించాలన్నారు. అనంతరం కామసముద్రం గ్రామంలో పౌర సరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేస్తున్న జొన్నలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు రామమోహన్‌రెడ్డి, అరుణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

13న మండల సర్వసభ్య సమావేశం

గోపవరం : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం తెలిపారు. ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, హాజరు కావాలన్నారు. అలాగే ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల వివరాలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలతో అన్నిశాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. అలాగే సమావేశానికి ముందురోజే ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలను కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎవరైనా సమావేశానికి గైర్హాజరవుతారో వారి వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపవరం : బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాలకు సంబంధించి శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈఈ కుళాయప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132/33 కె.వి., 33 కె.వి. సబ్‌స్టేషన్ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు ఈ అంతరాయం పట్ల విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.


ముంబై - చెన్నై ట్రైన్ లింక్ బస్సు సర్వీసు

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో నుంచి ముంబై - చెన్నై ట్రైన్ లింక్ బస్సు సర్వీసును నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్సు సర్వీసు శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. శనివారం (తర్వాత ప్రతి రోజు) ఉదయం 4.45 గంటల బస్సు మైదుకూరు బస్టాండ్ నుంచి బయల్దేరి 5.50 గంటలకు కడప రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ముంబై - చెన్నై రైలు నుంచి దిగిన ప్రయాణీకులను ఎక్కించుకుని 6 గంటలకు తిరిగి బయల్దేరుతుందని డీఎం తెలిపారు. ఈ బస్సు మైదుకూరు, పోరుమామిళ్ల, సీతానగరం మీదుగా 11.10 గంటలకు పామూరు చేరుకుంటుందన్నారు. పామూరు నుంచి 11.30 గంటలకు తిరిగి బయల్దేరి సాయంత్రం 5.05 గంటలకు కడప రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కడప, మైదుకూరు, పోరుమామిళ్ల, సీతానగరం, పామూరు ప్రాంతాల ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పారదర్శకంగా క్లెయిమ్‌ల పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్ : ఫోటో ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తర్వాత వచ్చిన క్లెయిమ్‌లను విచారించి పారదర్శకంగా పరిష్కరిస్తామని ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె. కౌసర్‌భాను ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 22న విడుదల చేసిన తుది జాబితా మేరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 2,46,726 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అందులో 1,19,678 మంది పురుషులు, 1,26,997 మంది మహిళలు, 51 మంది ఇతరులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 267 పోలింగ్ స్టేషన్ల పరిధిలోగల ఓటర్ల సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించామన్నారు. తుది జాబితా ప్రచురణ తర్వాత అంటే గతనెల 30 నుంచి ఈనెల 5వ తేది వరకు క్లెయిమ్‌లు స్వీకరించామన్నారు. ఫారం-6లు 606, ఫారం-7 1432, ఫారం-8 1415 వెరసి 3453 క్లెయిమ్‌లు వచ్చాయని వివరించారు. ఇంకా ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆన్‌లైన్‌లో క్లెయిమ్స్ నమోదు చేస్తే విచారించి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న డీటీసీ మీరాప్రసాద్

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్క వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరాప్రసాద్ పేర్కొన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో విద్యార్థులకు, షోరూం యజమానులకు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక శాతం రోడ్డు ప్రమాదాలకు అతివేగమే ముఖ్య కారణమని, ఇందుకోసం ప్రతిఒక్కరు తమ వాహనాలను నిర్ణీత వేగాన్ని మించి నడపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని కోరారు. ముఖ్యంగా ఆటోడ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక మార్గాల్లో ప్రయాణించడం, పరిమితికి మించి ప్రయాణికులను చేరవేరడం ప్రమాదానికి మూలకారణమని, ఈ విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. అలాగే కారుడ్రైవర్లు తప్పనిసరిగా సీటుబెల్టు ధరించాలని కోరారు. ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగం విధానాలకు స్వస్తి పలకాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎలాంటి అపోహలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఆసుపత్రులకు తరలించి మానవత్వం చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంవీఐ వి.శేఖర్‌రావు, ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, అర్బన్ సీఐ పి.యుగంధర్, ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు, ఎంఈఓ చెన్నయ్య, వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి

కడప ఎడ్యుకేషన్ : బడిఈడు పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ సూచించారు. శుక్రవారం కడప మున్సిపల్ హైస్కూల్‌లో పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిస్ట్రిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

53 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు, నిందితుడితో ఎస్ఐ

మైదుకూరు : పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఖాజాపీర్ అనే వ్యక్తిని మైదుకూరు పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి, సిబ్బందితో కలిసి దాడి చేసి మద్యం విక్రయిస్తున్న స్థానిక బద్వేల్ రోడ్డులోని ఖాజాపీర్‌ను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 53 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధి

గోపవరం : పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బద్వేలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాలువపల్లె, గానుగపెంట పాఠశాలల్లో చదువుతున్న 409 మంది విద్యార్థినీ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.